# గ్యాసోపాఖ్యానం

-నిష్ఫల

"ఒసే సుబ్బులూ, ఏదీ కాఫీ?"

ఏఁవే పలకవు, కాఫీ చుక్కపొయ్యవా? ఏడైందే! దీనమ్మ కడుపు బంగారం గానూ, ఎంత పిలిచినా కాఫీ తేదేం? నాకో పాడలవాటు, కాఫీ పడకపోతే బాత్‌రూం కెళ్ళలేను. దీనికేం పోయేకాలం, కాఫీ యివ్వదు. అరగంట నుంచీ గోలపెడుతున్నా రెస్పాన్సు లేదు. తప్పదు, వెళ్ళాలి. బాత్‌రూం నుంచీ వచ్చేసేడు. తుండుగుడ్డతో నిల్చున్నాడు.

"ఏయ్, కాఫీ ఏదీ?..." దీనికేం అయింది. బయటకే రాదు? చికాగ్గా పచార్లు చేస్తున్నాడు సుబ్బారావు కోపంతో.

మెల్లిగా ఎదురు పడింది సుబ్బులక్ష్మి. ఆమెను చూసేడు. ఆ మొహంలో గంభీరం చోటు చేసుకుంది. కాళీమాతలా జుత్తు విడిపోయి మొహాన్ని కప్పేసింది. సుబ్బారావు భార్య అవతారాన్ని చూసి జడుసుకున్న మాట నిజమే. అయినా, తమాయించుకున్నాడు.

"ఏఁవిటీ అవతారం? పొద్దున్నుంచీ కాకిలా అరుస్తుంటే వినిపించుకోవేం? ఈ మధ్యన చెవుడు కూడా సోకిందేఁవిటి? పలకవేం? కాఫీ ఏదీ?"

చర్న లేచి చూసింది మొగుణ్ణి; వీడికి కాఫీ కావాలా? అసలే అందరిళ్ళకెళ్ళి లేదనిపించుకున్నాను. సిగ్గుతో చస్తుంటే ఇతగాడికేం పోయింది. కాఫీట.. కాఫీ... సుబ్బులు మొగుడి చెయ్యి పట్టుకుంది. పచార్లాగిపోయాయి.

"ఇవాళ కాఫీ 'నో'!"

"ఏఁవిటే అంటున్నావు కాఫీ నో..న, వై?"

"పవమానసుతుడు బట్టు..."

"మంగళం పాడతావేం?"

"మరేం చెయ్యాలీ..."

"ఎవరికి మంగళం, స్నానమేనా చెయ్యకుండా?"

"గ్యాస్‌కి...!"

"ఆఁ...!"

"ఆఁహా...!"

ఎవరో రైవల్స్ గన్‌తో పేల్చినట్లు సుబ్బారావు ఆ మాటనే గన్ శబ్దంతో కుప్పకూలేడు. సుబ్బులు పోరు పెడుతూనే వుంది గ్యాస్ అయిపోతుందని. అదేం కాదులే, అనుకుని సరిపెట్టేసుకున్నాడు.

ఇప్పుడు ఫస్టు ట్రిప్పు కాఫీకే గ్యాసొచ్చింది. అయినా "ఇది, గట్టిగా చెప్పాలిగా." అబ్బే అలాంటిదేం లేదు. చెప్తే నా తంటాలు నాకున్నాయిగా. గొంతెండి పోతూంది. కాఫీ లేదు! వెధవుద్యోగం చేస్తున్నాను. తెల్లారితే కాఫీ కూడా పుట్టకుండా వుంది. ఎందుకీ జన్మ? అడిగితే మొదటికే మోసం. గ్యాస్ అయిపోయిందటని. ఇదే మంగళం పాడేస్తూంది. అయినా, దీన్ననీ లాభంలేదు. ఆ గ్యాస్ కంపెనీ వాళ్ళననాల. సమంగా నెలసరి పోయేవరకే పోస్తారు. ఇదొక బిజినెస్సు. ఇప్పుడిది గ్యాస్ తెమ్మంటుంది. ఎక్కడ తేనూ? ఆ మధ్యన అప్పారావు (మా ఆఫీస్‌లో ఫ్యూన్ లెండి) చెప్పేడు, గ్యాస్ సంపాదించటమంటే చంద్రమండలం వెళ్ళినంత కష్టంట. తరువాత యింకా ఏవో కాగితాలు ప్రొడ్యూస్ చెయ్యాలట. అబ్బో, ఈ తతంగం నేను పళ్ళేను. "హోటల్ కాకా"లో రెండు రూపాయలిచ్చీ తాగేస్తాను. తన్లో తనే తర్జన భర్జన పడిపోతున్నాడు. ముందు చూపూ, దూ(దు)రాలోచన గల సుబ్బారావు.

"ఇదిగో, మిమ్మల్నే, మీరర్జంటుగా గ్యాస్ బుక్‌చేసి రండి. ఎంతకని ఇల్లిల్లూ తిరుగుతాను సిలెండర్ల కోసం. ఒకరింట్లో అన్నం, మరొకరింట్లో కూరలు, పులుసులూ చేస్తాను. ఆఁ... ఎంతకని చేస్తానంట?"

"ఏది ఏమైనా సిలెండర్ తేవలసిందే. తిళ్ళూ తిప్పలూ లేకా పిల్లల్తో ఎన్నాళ్ళీ డిపెన్డెన్సు? విన్నారా?"

"మరీ కంగారైతే ఎలా సుబ్బులూ. ఓ ట్రిప్పూ

---

## రైలుబండి

**ఆ**ప్తులను ఆత్మీయులను
మోసుకొచ్చే వేళ
ఆనందాన్నందించే...
మిత్రుడిలా కన్పిస్తావు
వార్ని సాగనంపినపుడు
మానుంచి ఆనందాన్ని లాక్కెళుతున్న
శత్రువులా కన్పిస్తావు.

-కొప్పుల పద్మావతి

పళ్ళేదు గొంతులో. నీకు తెల్సుకద నే కాఫీగత ప్రాణి నని."

"ఆ డ్రాయర్‌లో డబ్బులున్నాయి, ఆ గూట్లో ఫ్లాస్కుంది. వెళ్ళి పట్రండి నాకూ పిల్లలకు. మీరూ ఓ కప్పు పోసుకోండి. అలాగే ఓ డజనిడ్లీలు తెండి, చెట్నీ వేరే గిన్నెలో పోయించి తెండి. ఇదే యివాళ మన భోజనం, తెల్సిందా?"

పెళ్ళాం మాటలు విన్న సుబ్బారావు అగ్గిమీద గుగ్గిలం అయి, చర్న లేచేడు బెత్తెడు మీదకు.

"మీరెంత 'గీ' పెట్టినా కాఫీ చుక్కలేదు. వెళ్ళండి"

ఇక క్లయిమాక్సు దాకా ఎందుకని వెళ్ళి తెచ్చేడు. కాఫీలూ, టిఫిన్లూ అయాయి కానీ సుబ్బారావు కోపం గానే వున్నాడు. అది చూసిన సుబ్బులక్ష్మి, వెనకడుగు వెయ్యడానికిచ్చగించక "ఎందుకంత కోపం? పిల్లలూ, నేనూ పస్తులుండాలనేనా మీ ఉద్దేశం? వెళ్ళండి!! పిల్లలూ, ఇదేనట. మరి నేనో? ఎద్దులా యింటా బయటా చాకిరీ చేస్తున్నాను కదు. అందుచేత నన్నో వెంట్రుకలా చూస్తోంది. అవును, అందరూ నన్ను చవట కిందే కట్టేసేరు. ఆ వెధవాఫీసర్ గాడూ, "నిన్నెవడయ్యా, ఎంఏ పాసు చేసేడు, తప్పులు లేకుండా డ్రాఫ్టు రాయలేవు కదా." రిమార్కిచ్చేసేడు. వెధవ జన్మ!

ఇది చూస్తే గ్యాస్ బుక్ చెయ్యమంటుంది. అటు చూస్తే తిండి పెట్టే ఆఫీస్. గ్యాస్ లేకపోతే తిండి మాటటుంటే, కాఫీ చుక్క కూడా పుట్టదు. ఆఫీస్ కెళ్ళకపోతే దరిద్రం పెరిగినట్లూ పెండింగ్ వర్కు పెరిగి పోతుంది. ఏది ప్రైమ్ జాబ్? మనసు కకావికలై చివరకు ఆఫీస్‌కే పోదామని నిశ్చయానికొచ్చే, "నేనా ఫీస్‌కెళ్దామనుకుంటున్నాను" గొణిగేడు.

"ముష్టాఫీస్... సియల్ పారేసి ముందా గ్యాస్ సంగతి చూడండి. తిండి ముందు. అది లేకపోతే వర్కేం చేస్తారు?"

"ఇదిగో బుక్కు వెళ్ళండి."

సుబ్బారావు బుర్ర కాస్తా ఆలోచించింది. తిండి వుండదు సరికదా, కాఫీ చుక్క కూడా దూరమయ్యే ప్రమాదం వుంది. సుబ్బులు చెప్పింది సబబే. డబ్బెంత కని హోటళ్ళకు పోస్తాం. అసలే సామాన్య మధ్య తరగతి వాళ్ళం. ఏంవిటో యీ గ్యాస్!

"ఒసే సుబ్బులూ, నైబర్స్ నడగలేవా?" రాయి విసిరేడు.

"అదీ అయింది. ఎన్నాళ్లిస్తారు. చెత్త ప్రశ్నలు వెయ్యకుండా ముందు మీరెళ్ళండి."

# కుచ్చీల ప్రాకు

కుచ్చీల ప్రాకులు తొడుక్కున్నట్టూ,
గణితంలోని
వర్గమూలం స్టెప్పులు వేసినట్లూ ఉండే
కొండ కింది చెరువులు;
పొలాల నోళ్లలో తీర్థం పోస్తూ
జీవ వాక్యాలయ్యే
కొండల కింది చెరువులు; –
ఈ దృశ్యం చెదిరి
ఈ ఊహ కమిలి,
రియల్ ఎస్టేట్ కొండలూ,
కాలేజీ కొండలూ, / కొండ చిలవలై
కాలనీ జనులనూ, విద్యార్థి జనాన్ని మింగుతూ,
సజీవ వాక్యం
సరసకు రావడం లేదు.
మూగగా, మౌనంగా
హాల్లోని నేను ఉయ్యాల్లా
ఊగుతూ ఉంటుంది నెలవంక!
సమాధానం ఉండదు!
నీటి వొంటి మీద
పడవ పురుగులు పాకుతూ ఉంటాయి!
సమాధానం రాదు!
ఊపిరి ప్రవాహంలో శబ్దం లేదు!
సాంఘిక శాస్త్రాలు చప్పుడు చేయడం లేదు.
సమాధానం ప్రవహించడంలేదు!
ఏ పైరునీ ఎగరనీయదు!
తల్లిభాష తల్లడిల్లుతూ
మూగతనానిదే పైచేయి శబ్ద కాలుష్యంలో!
సామాన్య శాస్త్రం అట్టలు ఊడి ఎగిరిపోతు
న్నాయి
కార్ఖానా కరకరలకీ, చిమ్నీల పొగలకి!
సమాధాన గగనం కనబడడం లేదు
హాల్లోని కేను ఉయ్యాల్లా
ఊగుతుంది నెలవంక మౌనంగా, మూగగా!

❖ ❖ ❖

దిగంతాలకే సరిపడే
దిగులే
ఓ నాదంగా మారుతూ వుంటుంది!

–ఒబ్బిని

పెళ్ళాం వెరీ సీరియస్ చూపిస్తున్నాదంటే, విషయం అల్లాటప్పా కాదు. ఇక తప్పుకుందికి సందు దొరక్క బయల్దేరాడు. ఓ గంట తరువాత తిరిగొచ్చాడు. ఉస్సు రంటూ కుర్చీలో కూలబడ్డాడు. పట్టిన చెమటను పక్కనున్న గావంచాను లాగి కసితీర తుడుచుకున్నాడు. గ్యాస్ బుక్‌ని టీపాయి మీదకి విసిరేడు.

పిల్లల్ని బడికి ఆటో ఎక్కించి వచ్చింది సుబ్బులక్ష్మి. మొగుణ్ణి చూసింది.

"బుక్ చేశారా? తొందరగా పంపమన్నారా?"

పెళ్ళాం అడిగే తీరుకు, అథారిటీకి కోపం వచ్చింది సుబ్బారావుకి. ఎంతైనా నేను నీ మొగుణ్ణి. అంత అథారి టేటివ్‌గా అడుగుతుందా మా ఆఫీసర్ గాళ్ళా? ఆయ్.. అనుకుని, తిరిగిద్దాం ఓ డోసనుకుని, అనవసరంగా ఓడిపోడం యిష్టంలేకా–

"ఆఁ.. అన్నీ అయ్యేయి. కానీ స్టాకు లేదట. రెండో, మూడో రోజులు పడుతుందట. ఇదీ కథనం."

"అయ్యయ్యో, ఇప్పుడేం చేద్దామండీ? అందర్నీ అడిగేసేను. ఇంకెవ్వరు ఇవ్వడానికి ముందుకు రారు. పిల్లలూ, మనం పస్తులే. పిల్లలేడుస్తారు. అయ్యయ్యో... ఎంత పని జరిగింది. గగ్గోలు పెట్టేసింది. లోలోపలే కుమిలిపోయింది. గదిలోకెళ్ళి తలుపేసుకుంది. వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం వస్తోంది. సుబ్బారావు గాభరా పడిపోయి తేరుకున్నాడు.

"సుబ్బులూ– చిన్న అయిడియా, బ్లాకులో కొందామా?"

"ఎంతుంటుందో?"

"ఎంతా లేదు, ఐదొందలే!"

"అమ్మో!"

"ఇంకెవ్వరూ ఇవ్వరుగ. కొనవలసిందే మరి."

అసలు సంగతి రేషన్ కార్డు లేందే బుక్ చెయ్య నన్నాడు ఏజెన్సీవాడు. అది చెప్తే నన్ను చంపేస్తుంది రేషన్ కార్డు తెమ్మని. పోతే పోయాయి అయిదొందలు. నెల్లాళ్ళ వరకు ఏ బాధా వుండదు. అదే ప్లానుతో కొనిపించేడు.

రోజులు గడుస్తున్నాయి. సుబ్బులు గ్యాస్ బుక్ చెయ్యమంటుంటే, దాటవేస్తున్నాడు రేపు, ఎల్లుండీ అని. మెల్లిగా నెల దాటింది– ఓ ఉదయానే గ్యాస్ డేంజర్ సిగ్నలిచ్చేసింది. నయం, కాఫీ డికాషన్ అయింది. పాలు వెచ్చబెట్టలేదు. పచ్చిపాలే పోసింది. ఎలాగోలా కాఫీ అయి, తాగేసి, భర్తకిచ్చింది.

"ఇదేంటి సుబ్బులూ కాఫీ చల్లగా అనిపిస్తోంది. వేడి చెయ్యకూడదా?"

"ఇక వేడెక్కదు" విసురుగా చెప్పింది.

"ఎందుకంట?"

"గ్యాసైపోయింది" రహస్యంగా చెప్పినట్లు చెప్పింది.

దాంతో సుబ్బారావుకి భయం వేసింది. తిరిగి పునఃప్రయత్నం చెయ్యాలి. ఏం బాధరా దేవుడా?

"ఇప్పుడేం చేద్దామే?"

"నా బుర్ర మీరు మీ బుర్ర నేను కొట్టుకుందాం. ఏం చేద్దామట. వెంటనే వెళ్ళి బుక్ చేసిరండి."

బాబోయ్, తిరిగి నా కొచ్చింది తంట అనుకున్నాడు. తప్పదని స్నానం చేసి, చల్లారిపోయిన కాఫీ చుక్క గొంతులో పోసుకుని బయల్దేరాడు. వెళ్ళినవాడు వెళ్ళినట్టే తిరిగొచ్చాడు.

"సుబ్బులూ, రేషన్ కార్డు లేందే గ్యాస్ బుక్ చెయ్యరట."

"అయిందా, అవుతుంది మరి. చిలక్కి చెప్పినట్టు చెప్తే వినిపించుకున్నారా?" పిల్లలకేం పెడతామండీ? ఏదో శని పట్టుకుంది. సరే, మీరు ఆఫీస్‌కి సెలవు పెట్టేసి గ్యాస్ బుక్ చెయ్యండి. పక్కింటి వాళ్ళ కార్డు తెస్తాను."

"సుబ్బులూ, యీ కార్డు పక్కవాళ్ళదని పోల్చెయ్యడు కద?" అనుమానం వెళ్ళబుచ్చేడు.

"నోరు మూస్తారా? వెధవనుమానం" వెళ్ళండి. మాదే అని చెప్పండి.

ఎందుకడిగేనా అనుకుంటూ బయల్దేరాడు. అక్కడ వున్న క్యూని చూసి నీళ్ళుగారేడు. నెత్తి మాడ్చే ఎండ. సుబ్బారావుది ఆంఫ్ బాల్డ్. కాస్తా పరవాలేదు. ఫుల్ బాల్డుగాళ్ళున్నారా క్యూలో. మాడుల మీద రుమాళ్ళేసు కున్నారు వేడి భరించలేక. ఎలాగైతేనేం సుబ్బారావు వంతొచ్చింది. బుల్ యిచ్చేడు రేషన్ కార్డడిగేడు. ఇచ్చేడు. రిజిస్టర్‌లో ఎంట్రీ చేస్తూ ఆగిపోయాడు.

## శిశిరం

ప్రతి రుతువూ
ఎన్ని తెస్తాయి / తమతో పాటు
శిశిరం ఒక్కటే
చుప్పనాతి
వచ్చి చెట్టెక్కి
అందర్నీ తగిలేస్తుంది

–మాధవీ సనారా

సుబ్బారావు గతుక్కుమన్నాడు. ఎందుకాగేడో అని. కొంపదీసి కార్డు నాది కాదంటాడా? వెధవాలోచనను పక్కకునెట్టి ధైర్యంగా నిల్చున్నాడు. అనుకున్నట్లే బుక్కర్ అన్నాడు– "ఈ కార్డు గల నెంబరుకు ఆల్‌రెడీ బుక్ చేసి గ్యాస్ సిలెండర్ కూడా ఇష్యూ అయింది. మరో "ట్వంటీ వన్ డేస్" పోతేగానీ తిరిగి బుక్ చెయ్యలేం" అని మొహంమీద పారేసినట్లు విసిరేడు. సుబ్బారావు మూర్ఛ వచ్చిన వాడిలా వణికిపోయాడు. చేసేది లేక ఇంటికొచ్చి పెళ్ళాంకీ శుభవార్త చెప్పేడు. సుబ్బులు చాలా బాధపడింది. అయోమయ స్థితిలో పడింది.

"సుబ్బులూ, నాకంటే బుర్రలేదుగానీ, బుర్రలు మార్చే తెలివి నీకుంది కదా. రీసెంటుగా ఈ కార్డు మీద బుక్ చేశారా" అని అడగలేకపోయావా? నాకీ బాధలు తప్పి వుండేవి. అనవసరంగా లీవ్ వేస్తు, ఎండలో రెండుసార్లు తిరగడం– ఇంతా చేస్తే సిలెండర్ లేక పోవడం. ఇదంతా నా కర్మం" అన్నాడు.

"మీ కర్మం కాదు నాది. అయిందేదో అయింది. ఇకనైనా రేషన్ కార్డు సంపాదించండి ఫ్యూచర్‌కి కూడా పనికొస్తుంది.

"అమ్మో! సుబ్బులూ, నన్నా రొంపిలోకి దింపకు. దాని కథా కమామీషు తెలియనివాణ్ణి."

"అలా అంటే ఎలాగండీ. ఎంత కష్టపడయినా తేవాలి. రేపు మా అమ్మా, నాన్నలు వస్తున్నారండీ. మన పస్తుల మాటటుంచండి. వాళ్ళని పడుకోబెట్టలేం కదా? నేనూ, పిల్లలూ పస్తులు పడుకున్నా ఫరవాలేదు. జాలా, నోలా? వీళ్ళ వాళ్ళు మాత్రం పస్తులుండ కూడదు. ఆడదాని గుణం చూపించింది. అయినా, విషయం అలాటిది. తప్పదు వెళ్ళాలి. "చల్లారిపోయిన కాఫీ చుక్కుంటే పోయి. కార్డుకెళ్ళాలి" అడిగేడు.

గెష్టుల గ్లాసులో సగానికి పోసి యిచ్చింది.

"ఇదేంవిటే, నన్నూ గెష్టు కిందే జమకట్టావన్న మాట?"

"ఎక్కువ తాగితే షుగర్ పట్టుకుంటుంది. చాల్లెండి. బయల్దేరండి" ప్రియంగానే చెప్తూ ఓ చిన్న దోసిచ్చింది.

మరోమాట లేకుండా బయటకు పరిగెత్తాడు. తిన్నగా ఏజెన్సీకెళ్ళి ప్రయత్నంగా అడిగేడు కార్డు.

"కొత్త కార్డులు మరో నెల పోయాకిస్తామండీ. ఆ కిటికీ దగ్గరకెళ్ళండి అప్లికేషనిస్తారు. అది నింపి, ఆదివారం రండి."

"అలాగేనండి' అనేసి కిటికీ దగ్గరకెళ్ళి, అరగంట తర్వాత అప్లికేషన్ పుచ్చుకున్నాడు. అప్లికేషన్‌కే అరగంట

## ఈక్ష్వాకుల నాటి శిథిలాలు..!

ఏదీ...? శాసించి చూడు నన్ను...?
అని
బిర్ర బిగిసిన కాలాన్ని
'చూపులు'
కొనగోటితోనే ఈడ్చికొట్టాయి...!

ఒళ్ళు మండిన కెరటాలు
ఆకాశంలో శికార్లు కొడ్తూ
ఒడ్డు దాటాయి అసహనంగా...!

చేతుల్లేని అవిటివాళ్ళ
బ్రతుకు ఆటల్లా – పగటి కాగడాలు
గమ్మున చల్లబడి
చేతకాక, తలవంచుకున్నాయి–

తన నీడల్ని కెరటాలు
తనలోనే చూసుకొని
ఏం తెలియని నంగనాచిలా
మాయమై పోయాయి...!

ఎదలో చోటులేని దరహాసాలు
పెదవులను వీడి
కెరటాలతో పాటు ఇంకిపోయాయి...

ఇసుక తిన్నెల మీద
మండిన గుండెలూ... ఆరిపోయిన నిట్టూర్పులూ
తుప్పుతిన్న తుపాకుల్లా పహరా కాస్తున్నాయి...
ప్రపంచం లోని సంవేదనలు
పాకురు గోడల్లా డొల్లుతూ నిలబడ్డాయి.

ప్రపంచంలోని సంవేదనలు
పాకురు గోడల్లా డొల్లుతే నిలబడ్డాయి...

'ఇవి ఈక్ష్వాకుల నాటి శిథిలాలు సుమా!'
అని గుంపుకు 'గైడ్' సుతారంగా
చెప్తుంటే
తడి గుండెలెక్కడో నరికిపారేసిన
మానవతలా సహనంతో కొట్టుకుంటున్నాయి.
శిథిలాలను పలకరించిన
ఆఖరు జాము కెరటాలు
దరహాసాలను వెదజల్లుతున్నాయి....!

–డా॥ జె.పి.వైద్య

పట్టింది. ఇక కార్డుకెంత టైం పడుతుందో అనుకుని, బ్రతుకుజీవుడా అంటూ ఇంటి ముఖం పట్టాడు.

"సుబ్బులూ ఒకటి సాధించేం" అన్నాడు ఇంటికొచ్చి.

"ఏఁవిటదని" అడిగితే అప్లికేషన్ చూపించాడు.

"ఓస్ యిదా? ఇదెందుకూ?"

"కళ్ళు పెద్దవి చేసి చూడు, చంపకుండా."

సర్రన లాగి చూసి "ఇదప్లికేషనూ" అంది.

"మరదే. దీన్ని నింపి సబ్మిట్ చేస్తే రేషన్ కార్డిస్తారుట."

"ఇదెన్నాళ్ళకో?" మూతి మూడు వంకరులు పోయింది.

## అంతే మరి

ఆకాశంలో సగం నేను గనుక
ఆయనలోనూ సగం నేనే ననుకున్నా
కాదని కాస్త ఆలస్యంగా తెలిసింది

ఆ సంపాదించిపెట్టే చేతులు
నాకు విదిల్చేవేదో అయిదువేలు
అన్నీ అందులోనే సరిపెట్టు
అని కొసరు ఉంగరాల మొట్టు

ధరలు పెరుగుతున్నాయంటే వినిపించుకోరు
ఇంటికెంత షోకు చేస్తున్నానో పట్టించుకోరు

ఇల్లా అయితే ఎల్లా కాపరం చెయ్యాలీయనతో?

కుక్కరు కొనుక్కోవడంలోని సౌకర్యం
మగాడి కొక్కడికే సొంతం అని
కాత్యాయని అన్నప్పుడు

మల్లెపూల సరస సల్లాపాలు
మగ మహారాజులకే నైవేద్యమని
అడపాదడపా విన్నప్పుడు

ఏమిటీ అమాయకపుమాటలు అని
వాళ్ళమీద జాలిపడేదాన్ని కాని
ఇప్పుడు నా మీద నాకే జాలి

అయినా ఇంటిల్లిపాదిమీ ఈయనకెలా
ఉపయోగపడతాం అని ఆలోచించడం మాని

ఈయన ఇంటికేం పాటడతాడో
అడిగేస్తే పోలా? మనిషి కాదూ!!

–కాండూరి

"వేచి చూడాలి."

"ఏదో అఘోరించండి."

"స్టుపిడ్. ఒక్కమాట కూడా తీయగా, ప్రేమగా అన్లేవు" అనుకుని, మర్నాడు ఏజెన్సీకి వెళ్ళేడు. నింపిన అప్లికేషన్ ఇచ్చాడు. అది చూసిన పెద్దమనిషి పెదవి విరిచేడు.

అది చూసిన సుబ్బారావు "ఏం తప్పు నింపేనా?"

"ఏవంటే మీరు ఫిలప్ చేసింది రాంగ్! మరోటి తీసుకుని ఫిలప్ చేయడానికి నా దగ్గరకు రండి. కోడిచ్చారండి రివర్సులో. దాని ప్రకారం నెంబర్లు వేయాలి ఆయా ఖాళీ జాగాల్లో."

అది విన్న సుబ్బారావుకి జ్వరం వచ్చేసింది. ఎలాగో మరోటి సంపాదించేడు. అతని దగ్గరకెళ్ళకపోతే మరేం ఫిటింగ్ పెడతాడో అనుకుని వెళ్ళి నింపించి ఇచ్చేసేయి. "హమ్మయ్య అనేసుకుని గోడవారగ నిల్చున్నాడు. అక్కడున్న టీ బడ్డీలో టీ తాగేడు. మనసులో ఏదో వ్యధ పీకుతోంది. తన 'పీజీ' అప్లికేషన్ నింపడానికి కూడా పనికిరాలేదు. ఏం నాలెడ్జో అనుకుని ఇన్ఫీరియర్‌గా కుంచించుకుని పోయాడు. "ఎవరయ్యా నిన్ను 'ఎంఏ' పాసు చేశారు. తప్పులు లేకుండా డ్రాఫ్ట్ రాయలేదన్నా"డు మా ఆఫీసరే! మానాభిమానాలకెక్కడ నెలవు లేదనుకుని కొట్టి పారేసేడు. ఒకసారి సుబ్బే లే అంది'చవట'ని. ఆలుమగలం కాబట్టే ఎన్నయినా అనుకోవచ్చని అప్పుడు సరిపెట్టుకున్నాడు. ఇంతలో పిలుపొచ్చింది.

"మీరు వచ్చే నెల పదిన రండి" అన్నాడు.

వచ్చే నెలంటే మరో నెల్లాళ్ళ పైనే! చచ్చేంరా దేవుడా!

"అయ్యా, అంతకన్నా ముందు దొరకదా?"

"మాకే దొరకవు. మీకెవడిస్తాడ"న్నాడు.

గ్యాస్ బుక్ చేసుకోవాలి. రేషన్ కార్డు లేందే బుక్ చెయ్యరట. పిల్లలతో తిండి లేక అఘోరిస్తున్నాం. దయచేసి తొందరగా ఇప్పించండి." డ్రామాలో బెగ్గర్ పాత్రలా అడిగేడు.

"గ్యాసుకీ దీనికీ ముడిపెట్టడం దురదృష్టకరం. హౌఎవ్వర్, కన్సిడరింగ్ యువర్ పేతటిక్ కండిషన్, ఉయ్ విల్ ట్రై ఫర్ యు" అన్నాడు పెద్దమనిషి.

"థాంక్సెలాట్" కనీస ధర్మంగా రిటరినిచ్చి ఉత్సాహంగా కదిలేడు సుబ్బారావు.

"గ్యాస్ బాధితులకిది అంకితం" సుబ్బారావు. ■